క్లుప్తంగా

సుమన్‌కు డాక్టరేట్



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ కెమిస్ట్రీ విభాగం పరిశోధకుడు సుమన్ బా నోతుకు యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రకటించింది. సింథసిస్ స్పెక్ట్రాల్ క్యారెక్టరైజేషన్ ఆన్ బయోయాక్టివ్ కాంప్లెక్స్ కాంటేయినింగ్ స్కి ఫ్స్ బేస్ లిగాండ్స్ అంశంపై పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి సుమన్‌కు డాక్టరేట్‌ను ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య పి.మల్లారెడ్డి తెలిపారు. కెమిస్ట్రీ విభాగం ఆచార్యులు డాక్టర్ ఎస్.జ్యోతి పర్యవేక్షణలో సుమన్ తన పీహెచ్‌డీ పూర్తిచేశారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు

మడికొండ: శ్రావణమాసం చివరి మంగళవారం పురస్కరించుకొని మడికొండలోని ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో అర్చకులు మంత్రవాది వెంకట ప్రసాద్ మంత్రోచ్ఛరణల మధ్య స్వామి వారికి ఉదయం పంచామృత అభిషేకం నిర్వహించిన అనంతరం ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. తండ శంకర్, కుమారస్వామి, వైష్ణవి, విజయ, రూపేష్, భక్తులు పాల్గొన్నారు.

ఎల్లమ్మతల్లికి..

కాజీపేట: శ్రావణ మాసంలో భాగంగా సోమిడిలో రేణుక ఎల్లమ్మ తల్లికి మంగళవారం భక్తులు ప్రత్యేక అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకులు శంకర శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి పసుపు, కుంకుమలు కలిపిన నదిజలాలతో అభిషేకాలు నిర్వహించారు.

ఆంజనేయుడికి అభిషేకం

కాశిబుగ్గ: స్థానిక శ్రీ రంగనాథస్వామి దేవాలయంలోని దక్షిణ ముఖ ఆంజనేయస్వామికి మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు ఉదయం పంచామృతాలతో అభిషేకం చేసి ఆకు పూజ నిర్వహించారు. కార్యక్రమాల్లో ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు వంగరి రవి, ప్రధాన కార్యదర్శి సురేష్, కోశాధికారి సుల్తానా, సమ్మక్క, అర్చకులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

ఖిలా వరంగల్: మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని వరంగల్ ఉర్సు కరీమాబాద్ బొడ్రాయి సుభాష్‌నగర్ చెందిన 19 ఏళ్ల యువతి అదృశ్యమైనట్లు సీఐ టి.సురేష్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం..సుభాష్‌నగర్‌కు చెందిన రేణుక చిన్నకుమార్తె దీక్షిత సోమవారం ఉదయం రంగశాయిపేటలోని బ్యాంకుకు వెళ్లి వస్తానని ఇంట్లో చెప్పి సాయంత్రమైన తిరిగి ఇంటికి చేరుకోలేదు. బంధువులు, స్నేహితులు ఇళ్లల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. మంగళవారం సాయంత్రం బాలిక తల్లి రేణుక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఓటర్ల పేర్లు గల్లంతు

వరంగల్ అర్బన్ : వరంగల్ 27వ డివిజన్‌లో ఓటర్ల పేర్లు గల్లంతయ్యాయని గ్రేటర్ వరంగల్ కమిషనర్, వరంగల్ తూర్పు ఈఆర్‌ఓ షేక్ రిజ్వాన్ బాషాకు టీపీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాశ్ వినతిపత్రాన్ని మంగళవారం సాయంత్రం బల్దియా ప్రధాన కార్యాలయంలో సమర్పించారు. పాత గ్రెయిన్ మార్కెట్ పోలింగ్ బూత్‌లో 137, 138లలో సమీపంలోని డివిజన్ బూత్‌లకు మార్పు జరిగినట్లు పేర్కొన్నారు. చాలా మంది ఓటర్ల పేర్లు గల్లంతైనట్లు నివేదిక అందచేసినట్లు తెలిపారు.

నాణ్యమైన బోధనతో మంచి ఫలితాలు

కేయూ క్యాంపస్: నాణ్యమైన విద్యాబోధన, మార్పులపై అవగాహనతోనే మంచి ఫలితాలు సాధించవచ్చని కేయూ వీసీ ఆచార్య తాటికొండ రమేష్ అన్నారు. మంగళవారం విశ్వవిద్యాలయం మహిళా పీజీ కళాశాలలో పార్ట్‌టైం అధ్యాపకులు పీజీలో నూతనంగా ప్రవేశాలు పొందే విద్యార్థులకు అవగాహనను వివిధ కళాశాలల్లో కల్పించిన నివేదికను వీసీకి సమర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంస్థలను కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరు బాధ్యతాయుతంగా పని చేయాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఎడవెల్లి రవీందర్, డాక్టర్ కె సంధ్యారాణి, డాక్టర్ గుగులోతు కవిత, డాక్టర్ కుమారస్వామి పాల్గొన్నారు.

నేటి నుంచి యాగం

హన్మకొండ అర్బన్ : ఈనెల 13, 14 తేదీల్లో నగరంలోని శ్రీహనుమద్గిరి పద్మాక్షి దేవస్థానంలో పద్మాక్షి అమ్మవారికి శ్రీ సువర్ణలక్ష్మి మహా మాంగళ్య యాగం నిర్వహించనున్నట్లు పద్మాక్షి దేవాలయ అనువంశీయ అర్చకులు నాగిళ్ల శంకరశర్మ, ఆలయ అర్చకులు నాగిళ్ల షణ్ముఖ పద్మనాభ అవధాని ఒక ప్రకటనలో తెలిపారు. వేడుకలకు జ్యోతిష్య బ్రహ్మశ్రీ చాముండేశ్వరీ ఉపాసకులు కొడకండ్ల శ్రీరామ్‌శరణ్ శర్మ గురూజీ పాల్గొంటారని వివరించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

పర్మనెంట్ చేయాలి

ఖిలా వరంగల్: మున్సిపల్ కార్మికులను ప్రభుత్వ తక్షణమే పర్మనెంట్ చేయాలని 37వ డివిజన్ కార్పొరేటర్ వేల్పుగొండ సువర్ణ కోరారు. మంగళవారం ఆమెకు మున్సిపల్ కార్మికులు, భారత రాష్ట్ర ట్రేడ్ యూనియన్స్ ప్రతినిధిలు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎమ్మెల్యే నరేందర్ కృషి ఫలితంగా కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులకు కూడా 30 శాతం పీఆర్‌సీ పెంచేలా కృషి చేశారని గుర్తు చేశారు. మీ సమస్యను ఎమ్మెల్యే ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చూపుతారని ధీమా వ్యక్తం చేశారు.

చర్చి భూములను కాపాడుకుందాం

- హన్మకొండ బాప్టిస్టు చర్చి ఏఈడీ సురేందర్‌బాబు



సమావేశంలో మాట్లాడుతున్న సురేందర్‌బాబు

ఖిలా వరంగల్: హనుమకొండలోని తెలుగు బాప్టిస్టు చర్చి మిషన్ ఆస్పత్రి భూములను పరిరక్షించుకుందామని ప్రాపర్టీ అసోసియేషన్ ఆఫ్ బాప్టిస్టు చర్చెస్ అడిషనల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మంద సురేందర్‌బాబు పిలుపునిచ్చారు. మంగళవారం వరంగల్ ఉర్సు కరీమాబాద్‌లోని తెలుగు బాప్టిస్టు చర్చిలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ చర్చి భూముల కబ్జాలను వెంటనే అరికట్టాలని డిమాండ్ చేశారు. ప్రజలకు ఉపయోగపడేలా హన్మకొండ బాప్టిస్టు సంఘం మిషన్ ఆసుపత్రికి స్థలాన్ని ఇచ్చిందని గుర్తుచేశారు. కానీ దేవుని భూములపై కన్నేసిన కొందరు కబ్జాదారులు చర్చికి సంబంధించిన భూములపై తప్పుడు రిజిస్ట్రేషన్ సృష్టించి అక్రమ నిర్మాణాలు చేపట్టారన్నారు. దీనిపై న్యాయ పోరాటం చేయగా 2006లోనే హైకోర్టు రిజిస్ట్రేషన్లు కొట్టేసిందన్నారు. ప్రభుత్వ అధికారులు ఆ నిర్మాణాలను తొలగించకపోగా కొందరు నాయకుల అండదండలతో బ్యాంకుల్లో రుణాలు పొందారన్నారు. పక్కనే ఉన్న మరింత స్థలాన్ని కబ్జా చేయటానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఈ విషయాన్ని నగర పోలీస్ కమిషనర్ రంగనాథ్ దృష్టికి తీసుకువెళ్లామన్నారు. సమావేశంలో సీబీసీ క్రిస్టియన్ కాలనీ ప్రెసిడెంట్ కొల్లూరి రాజ్‌కుమార్, పాస్టర్ దుప్పటి ఏలియా, జన్ను ఈర్మియా, రఘునందన్, ప్రేమ్ కుమార్, అగ్ని మినిస్ట్రీస్, డాక్టర్ జేజే థామస్, పి.సుమన్, ఎల్ జయా ప్రభాకర్, అర్ జయ ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

సనాతన ధర్మాన్ని కించపరచడం నీచమైన చర్య

- ఉదయనిధి స్టాలిన్ చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలి
- బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ



ఉదయనిధి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు, కార్యకర్తలు

హన్మకొండ: సనాతన ధర్మాన్ని కించపరచడం నీచమైన చర్య అని బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ అన్నారు. తమిళనాడు మంత్రి ఉదయనిధి స్టాలిన్ చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ హనుమకొండ జిల్లా శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ అమరవీరుల స్తూపం కూడలిలో ఉదయనిధి దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా రావు పద్మ మాట్లాడుతూ సనాతన ధర్మం పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన ఉదయనిధి భేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఎన్ని యుగాలు మారిన సనాతన ధర్మం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. రాజకీయాల కోసం, కొందరి మెప్పు కోసం సనాతన ధర్మాన్ని నిర్మూలించాలని పిలుపు ఇచ్చినంత మాత్రాన తుడిచిపెట్టుకుపోదన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణ సంఘం చైర్మన్ మార్తినేని ధర్మారావు, వరంగల్ పార్లమెంట్ ఇన్‌చార్జ్ వి.మురళీధర్ గౌడ్, మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు, నాయకులు రాకేష్‌రెడ్డి, దేశిని సదానందం గౌడ్, ఆర్.పి.జయంత్ లాల్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కమ్యూనిస్టులు నైజాం చరిత్రను తెలుసుకోవాలి

- సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు జగదీష్



సమావేశంలో మాట్లాడుతున్న జగదీష్

ఖిలా వరంగల్: కమ్యూనిస్టులు నైజాం సర్కార్ మధ్య జరిగిన పంచాయితీ చరిత్రను తెలుసుకోవాలని సీపీఎం రాష్ట కమిటీ సభ్యుడు జగదీష్ అన్నారు. మంగళవారం వరంగల్ ఉర్సుగుట్ట సమీపంలోని సీపీఎం కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ముక్కెర రామస్వామి అధ్యక్షతన వీరతెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా జగదీష్ హాజరై మాట్లాడుతూ ప్రభుత్వం భూస్వాములు, దోపిడీదారులకు అండగా ఉంటూ వేల ఎకరాల భూములను భూస్వాములకు కట్టబెట్టడం వల్లనే నైజాం సర్కార్‌ను కట్టడి చేసేందుకే తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం ఉవ్వెత్తున లేచిందన్నారు. వీర తెలంగాణ రైతాంగ సా యుధ పోరాటాన్ని వక్రీకరిస్తూ బీజేపీ ఆర్ఎస్ఎస్ మతోన్మాద శక్తులు సాయుధ పోరాటం జరగలేదని, హిందూ, ముస్లిం గొడవగా చిత్రీకరిస్తూ పో రాటాన్ని నీరుగార్చే విధంగా బీజేపీ ప్రభుత్వ ప్రయత్నం చేస్తుందని ఆరోపించారు. పేద భూములను దోచుకుని నానా ఇబ్బందులు పెట్టుతూ ప్ర జల చేత వెట్టి చాకిరి చేయించుకున్న పరిస్థితి ఆ రోజుల్లో ఉందన్నారు. ఆ పోరాటాల్లో కమ్యూనిస్టుల పాత్ర కీలకంగా ఉందని బీజేపీ వాళ్లు గుర్తించుకోవాలన్నారు. సమావేశంలో సీపీఎం జిల్లా కా ర్యదర్శి సీహెచ్ రంగయ్య, ప్రభాకర్, ఉపేందర్, సాజియా, దివ్యా , వాణి, సరిత, జుబేదా, యాకూబ్‌పాషా, విజయ, కిరణ్,తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

మడికొండ : రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలైన సంఘటన మడికొండ చౌరస్తాలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సొంత పని నిమిత్తం కాజీపేటకు వెళ్లి తిరిగి మడికొండకు బైక్‌పై వస్తున్న గణేష్ మడికొండ చౌరస్తాలో రోడ్డు క్రాస్ చేయడానికి వేచి యుండగా హన్మకొండ నుంచి హైదరాబాద్‌వైపు వెళ్తున్న కారు బైక్‌ను ఢీ కొట్టింది. దీంతో బైకు ముందు ఉన్న స్కూటీపై ఉన్న చంద్రమౌళి, సైకిల్‌పై ఉన్న వెంకటయ్యకు ఢీ కొట్టింది. గాయాలైన వారిని చికిత్స నిమిత్తం ప్రైవేట్ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

19న గద్దర్ సంస్మరణ సభ



ఖిలా వరంగల్: పడమరకోట జంక్షన్ అంబేడ్కర్ విగ్రహం ప్రాంగణంలో ఈనెల 19న జరిగే ప్రజాయుద్ధ నౌక గద్దర్ సంస్మరణ సభను విజయవంతం చేయాలని ఆహ్వాన కమిటీ కన్వీనర్ బోళ్ల భిక్షపతి పిలుపునిచ్చారు. మంగళవారం పడమరకోట అంబేడ్కర్ విగ్రహం వద్ద గద్దర్ సంస్మరణ సభ ఆహ్వాన కమిటీ ఆధ్వర్యంలో రూపొందించిన కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ఆగస్టు 6న గద్దర్ మరణం విప్లవ శక్తులు, పీడిత ప్రజలకు తీరనిలోటని తెలిపారు. సంస్మరణ సభకు వేలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమానికి నాగబెల్లి రాజన్‌బాబు, మైదం రవన్న, మైదం బాబు, ధనంజయ్, ఎడ్ల సారంగపాణి, ఎడ్ల శ్రీను, ప్రేమ్ సాగర్, రాజు, భిక్షపతి నర్సింగం పాల్గొన్నారు.

పెండింగ్ ప్రోత్సాహకాలు చెల్లించండి



డీడీ ప్రదీప్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాకతీయ పాడిరైతుల సంఘం బాధ్యులు

హన్మకొండ చౌరస్తా: పాడి రైతులకు పెండింగ్‌లో ఉన్న రూ.4 ప్రోత్సాహకాలను వెంటనే చెల్లించాలని కోరుతూ విజయ కాకతీయ పాడి రైతుల సంక్షేమ సంఘం బాధ్యులు మంగళవారం విజయ డెయిరీ వరంగల్ డీడీ ప్రదీప్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు ఇరుకు దేవేందర్‌రావు మాట్లాడుతూ పాడి రైతులను ప్రోత్సహించాలనే లక్ష్యంతో ప్రతి లీటరు పై రూ.4 ఇన్సెంటివ్‌ను ప్రభుత్వం అందిస్తుందన్నారు. సుమారు రెండేళ్ల నుంచి ఇన్సెంటివ్ అందడం లేదని, దీంతో పాడిరైతులు నిరుత్సాహంలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి వరంగల్ షెడ్‌కు నూతన మిషనరీని అందించి, ప్రైవేట్ డెయిరీలకు తట్టుకునేలా తీర్చిదిద్దాలని కోరారు. విజయ కాకతీయ జిల్లా యూనియన్ ఏర్పాటు చేసి పాడి రైతుల అభివృద్ధికి సహకరించాలని, వరంగల్ డీడీకి వినతిపత్రం ద్వారా ప్రభుత్వ దృష్టికి సమస్యలను తీసుకెళ్తున్నట్లు తెలిపారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఎస్.రత్నాకర్‌రావు, రాసాల సమ్మయ్య, పి.మహేందర్, పరుచూరి నరేంద్ర, సాంబయ్య ఉన్నారు.

ఉత్సవాలకు ముస్తాబైన శ్వేతార్కాలయం

- నేడు వేడుకలు ప్రారంభం



విద్యుత్ దీపాలంకరణలో శ్వేతార్కాలయం

కాజీపేట : స్థానిక స్వయంభూశ్రీ శ్వేతార్కమూలగణపతి దివ్యక్షేత్రం గణపతి ఉత్సవాలకు రంగురంగుల విద్యుత్ దీపాల అలంకరణలతో అందంగా ముస్తాబైంది. తోగుట్ట పీఠాధిపతి శ్రీమాదవానంద సరస్వతీ స్వామి ఆశీస్సులతో బుధవారం ఆలయ వ్యవస్థాపకులు ఐనవోలు అనంతమల్లయ్య శర్మ సిద్ధాంతి ఆధ్వర్యంలో వేడుకలు ప్రారంభం కానున్నాయి. ఆలయంలో 16 రోజులపాటు నిరంతరంగా ఉత్సవాలను నిర్వహించడానికి నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేశారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి దర్శనానికి వచ్చే భక్తులు ఉత్సవాల్లో భాగస్వామ్యం పంచుకునేలా అవసరమైన అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. ప్రతిరోజు సాయంత్రం ఆలయ సమావేశ మందిరంలో పండితులచే సాహిత్య గోష్ఠులు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేలా ఏర్పాట్లు చేశారు. సెప్టెంబర్ 28న గణపతి దీక్షల మాలా విరమణతో పాటు గణేషుడిని నిమజ్జనం చేయడం జరుగుతుందన్నారు. ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకులు రాధాకృష్ణ శర్మ కోరారు.

ఆకట్టుకుంటున్న పరిణయ వస్త్ర ప్రదర్శన



వస్త్ర ప్రదర్శనలో వస్త్రాలు కొనుగోలు చేస్తున్న మహిళలు

హన్మకొండ: హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో నిర్వహిస్తున్న పరిణయ వస్త్ర ప్రదర్శన నగర వాసులను ఆకట్టుకుంది. దేశంలోని వివిధ రాష్ట్రాల చేనేత కళాకారులు రూపొందించిన అద్భుత డిజైన్ల ఆధ్వర్యంలో ఉత్పత్తి చేసిన వివిధ రకాల వస్త్ర ప్రదర్శన ఫ్యాషన్ ప్రియులను అబ్బురపరుస్తుంది. తమకు నచ్చిన వస్త్రాలను కొనుగోలు చేస్తున్నారు. పలువురు మహిళలు మాట్లాడుతూ ఈ ప్రదర్శనలో చోటుచేసుకున్న చేనేత వస్త్రాలు భారతీయ సాంప్రదాయం ప్రతిబింబించేలా ఉన్నాయని తెలిపారు. ఎగ్జిబిషన్ నిర్వాహకుడు టీపీ రావు మాట్లాడుతూ వివాహ, శుభకార్యాలు, పండుగలతో పాటు ఇతర ప్రత్యేక సందర్భాలలో ధరించేవి, దేశంలో ఎంతో పేరు గాంచిన వివిధ రకాల వస్త్రాలైన ఉప్పాడ, కలంకారీ, మంగళగిరి, ప్రింట్ చీరలు, సిల్క్ చీరలు, కాటన్, కాశ్మీర్ సిల్క్, బౌస్‌లు, టాప్స్, వన్ గ్రామ గోల్డ్ జువెల్లరీ లభిస్తాయని వివరించారు. ఈ వస్త్ర ప్రదర్శన ఈ నెల 13తో ముగుస్తుందని తెలిపారు.

మహిళలు అప్రమత్తంగా ఉండాలి



హన్మకొండ చౌరస్తా: నేరాలు, అఘాయిత్యాలు పెరుగుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో బాలికలు, మహిళలు అప్రమత్తంగా ఉండి జాగ్రత్తలు పాటిస్తే నేరా లను అదుపు చేయొచ్చని వరంగల్ షీటీమ్ ఎస్సై కంచి విద్యాసాగర్ అన్నారు. హనుమకొండ 5వ డివిజన్‌లోని ఏకశిల జూనియర్ కాలేజీలో బాలికల కు సైబర్, అత్యాచారాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈవ్ టీజింగ్ , గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌పై అవగాహన పెంచుకోవాలని, సోషల్‌మీడియాలో వ్యక్తిగత ఫోటోలు పంచుకోవడంలో జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. సైబర్ నేరాలు జరిగితే టోల్‌ఫ్రీ నెంబర్ 1930కు ఫిర్యాదు చేయాలన్నారు. ఏమైనా ఇబ్బందులు తలెత్తితే 8712685142, 8712685270 ల ద్వారా ఫిర్యాదు చేయొచ్చన్నారు. ఏకశిల విద్యా సంస్థల చైర్మన్ గౌరు తిరుపతిరెడ్డి, డైరెక్టర్ జితేందర్‌రెడ్డి, ప్రిన్సిపల్స్ తిరుపతిరెడ్డి, రాజిరెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

ఖిలా వరంగల్: వరంగల్ జిల్లా దివ్యాంగుల సంఘం మహిళా విభాగం కార్యదర్శి, కాకతీయ–1 సమాఖ్య అధ్యక్షురాలు అడ్లూరి వాణి తల్లి అనారోగ్యంతో మంగళవారం మృతి చెందింది. దహన సంస్కారాలు నిర్వహించేందుకు దివ్యాంగురాలు వాణి చేతిలో చిల్లిగవ్వ లేదు. ఈ విషయాన్ని దివ్యాంగుల రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ.అజీమ్ మంగళవారం ఉదయం ఎమ్మెల్యే నరేందర్ దృష్టి తీసుకెళ్లారు. వెంటనే ఎమ్మెల్యే స్పందించి దహన సంస్కారాలయ్యే ఖర్చు మొత్తాన్ని ఎమ్మెల్యే దివ్యాంగుల అధ్యక్షుడు ఎండీ.అజీమ్‌కు చేతుల మీదుగా దివ్యాంగురాలు వాణికి అందజేశారు. అందజేసిన వారిలో బండి చక్రపాణి, రాజేందర్, సతీష్ ఉన్నారు.

సంక్షిప్త సమాచారం

కాశిబుగ్గ : గ్రేటర్ వరంగల్ 35వ డివిజన్ ఏసీరెడ్డి నగర్‌కు చెందిన బీజేపీ కార్యకర్త గుండు సునీల్ మంగళవారం గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బీజేపీ రాష్ట కార్యవర్గ సభ్యుడు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు మృతదేహన్ని సందర్శించి నివాళులు అర్పించారు. అనంతరం మృతుడు కుటుంబ సభ్యులను పరామర్శించి రూ. 10 వేల ఆర్థిక సాయం అందజేశారు. బీజేపీ డివిజన్ అధ్యక్షులు అజయ్, సురేందర్ ఉన్నారు.

చిరుధాన్యాలతోనే ఆరోగ్యం

ఖిలా వరంగల్: చిరుధాన్యాలతోనే గర్భిణిలు, పిల్లలు మరింత ఆరోగ్యంగా ఉంటారని అంగన్‌వాడీ ఉర్సు సెక్టార్ సూపర్‌వైజర్ బత్తిని రమాదేవి సూచించారు. మంగళవారం కరీమాబాద్ బీరన్నకుంట అంగన్‌వాడీ కేంద్రంలో టీచర్ల ఆధ్వర్యంలో పోషణ ర్యాలీ నిర్వహించారు. అనంతరం చిన్నారులకు అక్షరాభ్యాసం, గర్భిణిలకు సీమంతాలు చేపట్టారు.

టికెట్ రావాలని మోకాళ్లపై తిరుమలకు

హన్మకొండ: బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఏనుగుల రాకేష్‌రెడ్డికి బీజేపీ నుంచి టికెట్ రావాలని, అ సెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించాలని కోరుతూ పార్టీ కార్యకర్తలు, అభిమానులు మోకాళ్లపై తిరుమల కొండను ఎక్కి మొక్కులు చెల్లించుకున్నారు. బీజేపీ కార్యకర్తలు నాగరాజు, శ్రీకాంత్ మంగళవారం తిరుపతి చేరుకుని నడక మార్గాన తిరుమలకు చేరుకున్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు సహస్రశ్రీ ఎంపిక

కాకోజీ సెంటర్ : జాతీయ సైన్స్ సెమినార్ –2023లో భాగంగా మామునూరులోని జెడ్పీహెచ్ఎస్‌లో 'మిలెట్స్ – అద్భుతమైన అహారమా లేదా ఆహార వ్యామోహమా?' అంశంపై జరుగుతున్న జిల్లాస్థాయి పోటీల్లో అక్షర హైస్కూల్ విద్యార్థిని సహస్రశ్రీ ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ నెల 19న హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు డీఈఓ వాసంతి తెలిపారు. ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన సిద్ధార్థ (సెయింట్ మేరీ స్కూల్), తరుణ్ (జెడ్పీహెచ్ఎస్, కొండూరు), సాహితీప్రియ (జెడ్పీహెచ్ఎస్, బొల్లికుంట)కు అతిథులు ప్రశంసపత్రాలు, జ్ఞాపికలు అందజేసినట్లు వివరించారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి డాక్టర్ కట్ల శ్రీనివాస్, న్యాయ నిర్ణేతలు డాక్టర్ వైజయంతి, డాక్టర్ వీణ, పరమేశ్వర్, పాఠశాల హెచ్ఎం శ్రీనిధిశర్మ, కృష్ణ, ధనలక్ష్మి, రమేష్, శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన నామినేషన్లు

కాజీపేట రూరల్ : సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ కో–ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్ (ఈసీసీఎస్) ఎన్నికలకు సంబంధించిన డెలి గేట్స్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ మంగళవారం ముగిసింది. కాజీపేట రైల్వే సీసీఎస్ కా ర్యాలయం కేంద్రంగా 11వ నియోజకవర్గం పరిధిలోని 13 సీసీఎస్ డెలిగేట్స్ పదవులకు సుమారు 50 నామినేషన్లను సికింద్రాబాద్ హిమ్మత్‌నగర్‌లోని రైల్వే సీసీఎస్ హెడ్ ఆఫీస్‌లో దాఖలు చేశారు.

స్కూటీని ఢీకొన్న ఇసుక ట్రాక్టర్.. వ్యక్తికి గాయాలు

ఖిలా వరంగల్: వరంగల్–ఖమ్మం జాతీయ రహదారిపై గవిచర్ల క్రాస్ జంక్షన్‌లో స్కూటీని ఇసుక ట్రాక్టర్ ఢీకొనడంతో వ్యక్తికి తీవ్రగాయలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం..రంగశాయిపేటకు చెందిన ఓ వ్యక్తి స్కూటీపై వెళ్తున్నాడు. ఈ క్రమంలో గవిచర్ల క్రాస్‌రోడ్డు జంక్షన్‌లో అక్రమంగా ఇసుకను తరలించే ట్రాక్టర్ మంగళవారం స్కూటీని ఢీకొట్టింది. దీంతో స్కూటీపై ఉన్న వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. వెంటనే స్థానికులు క్షతగాత్రుడిని ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. ఈ విషయం తెలిసిన మిల్స్‌కాలనీ పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించినట్లు తెలిసింది.

సెర్ప్ టీం పనితీరు అద్భుతం

- పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా



మాట్లాడుతున్న సందీప్‌కుమార్ సుల్తానియా

ఖిలా వరంగల్ : సెర్ప్ టీం పనితీరు అద్భుతమని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా అన్నారు. వరంగల్ కలెక్టర్ కాన్ఫరెన్స్ హాల్‌లో డీఆర్డీఓ సంపత్‌రావు ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. ఓరుగల్లు మహా సమాఖ్య ద్వారా 466 మంది మహిళలు అండమాన్ నికోబార్ దీవులు, డయ్యూడామన్, లడఖ్‌లో పర్యటించారని తెలిపారు. అంతేకాకుండా మహారాష్ట్ర, ఒడిశా వంటి 17 రాష్ట్రాల్లో శిక్షణ ఇచ్చారని తెలిపారు. మహిళలు ఆదాయం సమకూర్చడంతోపాటు రాష్ట్రానికి మంచి పేరు తెచ్చి పెట్టారని ప్రశంసించారు. మహిళలు ఒకప్పుడు ఇంటి నుంచి బయటకు వెళ్లడమే కష్టతరంగా ఉన్న రోజుల్లో కేంద్ర పాలిత ప్రాంతాలు, రాష్ట్రాల్లో సందర్శించే అవకాశం వచ్చిందని తెలిపారు. వారి పిల్లలకు మంచి భవిష్యత్ ఇస్తారని పేర్కొన్నారు. ఓరుగల్లు మహా సమాఖ్య ద్వారా ఇతర రాష్ట్రాలకు వెళ్లి శిక్షణ ఇస్తూ సంఘాల కోసం పనిచేస్తున్న ఆర్పీల సేవలు సైతం అమోఘమన్నారు. కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ మహిళా సంఘాలు చాలా యాక్టివ్‌గా పని చేస్తున్నాయని తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ అశ్వినితానాజీవాకాడే, డీపీఓ కల్పన, ఐడీఎం రాజు తదితరులు పాల్గొన్నారు.

న్యాయమైన సమస్యలు పరిష్కరించాలి

హసన్‌పర్తి: అంగన్‌వాడీ ఉద్యోగులను పర్మనెంట్ చేయాలని ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు పుట్ట రవి, చుంచు రాజేందర్ డిమాండ్ చేశారు. న్యాయమైన సమస్యలుపరిష్కరించా లని కోరుతూ తహసీల్ కార్యాల యం ముందు అంగన్‌వాడీ ఉద్యోగులు చేప ట్టి దీక్ష శిబిరాన్ని మంగళవారం వారు సందర్శించారు. కర్ణాకర్, నరేష్, మొగిలి, ప్రేమ్ నాయక్ పాల్గొన్నారు.


మట్టి వినాయకులను ప్రతిష్ఠించాలి



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్లు

రామన్నపేట : మట్టివినాయకులను ప్రతిష్ఠించి పర్యావరణాన్ని కాపాడుదామని ఏవీవీ కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ చందా విజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి కొడిమాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మట్టివినాయకులపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మట్టి వినాయకులపై ప్రజల్లో చైతన్యం కలిగించాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు ఎన్ఎస్ఎస్ కో–అర్డినేటర్ కొడిమాల శ్రీనివాసరావు, చందా శ్రీకాంత్, ప్రిన్సిపాల్ భుజంగరెడ్డి, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

నిధుల మంజూరుపై హర్షం



కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ప్రజాప్రతినిధులు, రైతులు

హసన్‌పర్తి: మండలంలోని నాగారం పెద్ద చెరువు అభివృద్ధికి రూ.25.19 కోట్లు నిధుల మంజూరు కావడంతో రైతులు, ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం సీఎం కేసీఆర్, వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్‌ల చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమానికి మాజీ ఎంపీపీ కొండపాక సుకన్య ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ నాగారం చెరువు కింద సుమారు వేయి ఎకరాల మేరకు ఆయకట్టు ఉందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు పెసరు శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీ సుమతి, మాజీ సర్పంచ్ కొండపాక రఘు, సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధితులు, తదితరులు పాల్గొన్నారు.